ఎన్నికల విధుల్లో మినహాయింపు ఇవ్వాలి

కాగజ్‌నగర్, మార్చి 31: మే 13న పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే దివ్యాంగులు, గర్భిణులు, తల్లులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, ఆరు నెలల్లో ఉద్యోగ విరమణ పొందేవారికి విధుల్లో నుంచి మినహాయింపు ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎటుకూరి శ్రీనివాస్, సంఘం నాయకులు భిక్షపతి, శ్రవణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గత నవంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన కొందరు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ ఇప్పటి వరకు అందలేదని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఈనెల 6న క్రికెట్ పోటీలు

తిర్యాణి, మార్చి 31: మండలంలోని గంభీరావుపేట్ గ్రామంలో శ్రీకోదండ రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జనగామ తిరుపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి టీం రూ.11 వందల ఎంట్రీ ఫీజు చెల్లించి పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఈ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు,రెండో బహుమతి రూ.6వేలు అందించనున్నట్లు తెలిపారు. ఈ క్రీడల్లో నిర్ణీత టీంల కంటే ఎక్కువ టీంలు పాల్గొన్నా బహుమతులు పెంచుతామని సూచించారు. మండలంలోని క్రీడాకారులకు మాత్రమే ఈ క్రీడల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. క్రీడాకారులు అత్యధికంగా పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

విజృంభిస్తున్న మంప్స్

- గవద బిళ్లల సమస్యతో బాధపడుతున్న చిన్నారులు
- వ్యాప్తి చెందుతున్న వైరస్
- దవాఖానలకు పెరుగుతున్న తాకిడి

జిల్లాలో మంప్స్ (గవద బిళ్లల) వ్యాధి విజృంభిస్తోంది. ఒకరి నుంచి ఇంకొకరికి వేగంగా వ్యాప్తి చెందుతోంది. రెండు నెలలుగా జిల్లా వ్యాప్తంగా చాలా మంది ఈ వ్యాధి బారినపడి మంచం పడుతున్నారు. పిల్లలు నొప్పిని భరించలేక పోతుండడంతో తల్లిదండ్రులు దవాఖానలకు పరుగులు తీస్తున్నారు.

ఆసిఫాబాద్, మార్చి 31 : జిల్లా వ్యాప్తంగా మంప్స్ వైరస్ చిన్నారులను ఇబ్బందిపెడుతోంది. గవద బిళ్లల సమస్యతో పిల్లలు మంచం పడుతున్నారు. చెవుల కింద, దవడ భాగాల్లో వాపు రావడంతోపాటు తల నొప్పి, కండరాల నొప్పి, కీళ్లనొప్పి, కీళ్లల్లో వాపు, నోరు తడారి పోవడం, ఆకలి మందగించడం, జ్వరం తదితర లక్షణాలతో పిల్లలు బాధపడుతున్నారు. చిన్న పిల్లలకు గవద బిళ్లల సమస్య ఎదురైనపుడు వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సమస్య చెప్పుకోలేక ఏడుస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వైరస్ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, లేకపోతే మరింత ఇబ్బంది పడాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.

ఇలా వ్యాపిస్తుంది

మంప్స్ సమస్యతో బాధపడుతున్న చిన్నారులు దగ్గినపుడు, తుమ్మినపుడు, మాట్లాడినప్పుడు వైరస్ గాలిలో ప్రయాణించి ఇతరులకు వ్యాప్తి చెందుతుంది. ఎక్కువగా 15 ఏళ్లలోపు పిల్లల్లో ఈ సమస్య కనిపిస్తుంది. స్కూళ్లకువెళ్లే చిన్న పిల్లల్లో ఒకరికి సమస్య ఎదురైతే వారి ద్వారా అందరికీ వ్యాప్తి చెందే అవకాశాలుంటాయి.

దవాఖానకు క్యూ

గవద బిళ్లలు సమస్యతో పిల్లల దవాఖానలు కిటకిటలాడుతున్నాయి. జిల్లాలో ఏ హాస్పిటల్‌కు వెళ్లినా పదుల సంఖ్యలో గవద బిళ్లలు సమస్యతో వస్తున్న వారే కనిపిస్తున్నారు. ఇటీవలి కాలంలో వందలాది మందికి వైరస్ సోకింది. కొన్ని కుటుంబాల్లో పిల్లల ద్వారా పెద్ద వాళ్లకు సైతం వైరస్ వ్యాప్తి చెందింది. గవద బిళ్లలు సోకినవారు వారం రోజుల పాటు ఐసోలేషన్లో ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మంప్స్ వైరస్‌తో బాధపడుతున్న పిల్లలను బడికి పంపకుండా ఇంట్లోనే ఏకాంతంగా ఉంచాలని, ఇంట్లో తయారు చేసిన తేలికపాటి ఆహారాన్ని అందించాలని సూచిస్తున్నారు. తగినంత మంచినీరు, పండ్ల రసాలు ఇవ్వాలని సూచిస్తున్నారు.

గదవ బిళ్లలో మా పాప ఇబ్బంది పడింది

ఇటీవల మా పాపకు గదవ బిల్లల సమస్య రావడంతో చాలా ఇబ్బంది పడింది. పాఠశాలకు పంపకుండా ఇంట్లోనే ఉంచి జాగ్రత్తలు తీసుకున్నాం. వారం రోజులపాటు వైద్యుల సూచలనలతో మందులివ్వడంతో తగ్గింది. పెద్దగా భయపడాల్సిన అవసరం లేనప్పటికీ జాగ్రత్తలు తీసుకోవాలి. మంప్స్‌తో చిన్నారులకు అవస్థ ఉంటుంది.

-గాజర్ల శైలేందర్, ఆసిఫాబాద్

భయం వద్దు. తేలికగా తీసుకోవద్దు

గవద బిళ్లలుగా పేర్కొనే మంప్స్ వ్యాధి ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుంది. జ్వరం, తలనొప్పి, నీరసించిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇంట్లో ఒక చిన్నారిలో సమస్యను గమనిస్తే మిగతా వారికి వ్యాప్తి చెందే అవకాశాలుంటాయి. ఇలాంటి సమయంలో మిగతా పిల్లల నుంచి దూరంగా ఉంచాలి. ఈ వ్యాధికి భయపడొద్దు. అలాగని తేలికగా తీసుకోవద్దు. వైరస్ బారిన పడినపుడు వైద్యులను సంప్రదించి చికిత్స చేయించాలి. వైద్యుల సూచనలకు అనుగుణంగా మందులు వాడడంతోపాటు శక్తినిచ్చే ద్రవాహారాన్ని అందిస్తే త్వరగానే వ్యాధి తగ్గిపోతుంది.

-సమత, పిల్లల వైద్యనిపుణురాలు, ఆసిఫాబాద్

శాంతి భద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్

కొండపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ అల్లం రాంబాబు

పెంచికల్ పేట్, మార్చి 31: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు అన్నారు. ఆదివారం మండలంలోని కొండపల్లి గ్రామంలో ఎస్సీ సురేశ్ కుమార్ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని అన్నారు. గ్రామాల్లో గుడుంబా, పేకాట, కోడిపందాలు నిర్వహించవద్దని సూచించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. సరైన పత్రాలు లేకుండా 50 వేలకు మించి డబ్బులతో పట్టుపడితే స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు, రాజు, కొమురయ్య, బెజ్జూర్, దహెగాం, పెంచికల్ పేట్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న సమతా సైనిక్‌దళ్ కేంద్ర సభ్యుడు మార్షల్ రవిచంద్ర జాబాడె

జైనూర్, మార్చి 31 : సమతా సైనిక్‌దళ్ శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయాలని సమతా సైనిక్‌దల్ కేంద్ర రాష్ట్ర సభ్యుడు మార్షల్ రవిచంద్ర జాబాడె అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు కెరమెరి మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణ సందర్భంగా ఈ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కెరమెరి, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్, గాదిగూడ మండలాల నుంచి పెద్దఎత్తున యువత ఈ శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. గౌతమ బుద్ధుని శాంతి మార్గంతో మంచి అలవాట్లు అలవర్చుకొని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేషన్ శిలానంద్ కాంబ్లే, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పాపేస్ బాన్‌సాడే, రాష్ట్ర ట్రైనింగ్ ఆఫీసర్ విక్రమ్ కాంబ్లే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అసోసియేషన్ యూత్ నాయకుడు సిద్ధార్థ సోనికాంబ్లే, సత్యవాణి కాంబ్లే, ఘటనాకర్ వాగ్మారె, అభయ్ కాంబ్లే, అశోక్ కాంబ్లే తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి

- ఆసిఫాబాద్ సీడీపీవో సాదియా రుక్సాన

చింతలమాధర అంగన్‌వాడీ కేంద్రం వద్ద చిన్నారుల తల్లులతో మాట్లాడుతున్న సీడీపీవో సాదియా రుక్సాన

తిర్యాణి, మార్చి 31: చిన్నారుల్లో పోషణ లోపం రాకుండా అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని అందించాలని ఆసిఫాబాద్ సీడీపీవో సాదియా రుక్సాన సిబ్బందికి సూచించారు. మండలంలోని చింతలమాధర, పంగిడి గ్రామాల్లోని అంగన్‌వాడీ లబ్ధిదారుల చిన్నారుల స్థితిగతులను ఆదివారం ఇంటింటా పరిశీలించారు. ఆయా సెంటర్ల పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్ల రికార్డులను పరిశీలించారు. పిల్లల బరువు, ఎత్తు చుట్టు కొలతలు తీశారు. పోషకాహార లోపం ఉన్న పిల్లల తల్లులు, గర్భిణులతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వాలు అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా బాలింతలు, గర్భిణులు, యుక్తవయస్సు బాలికలు, చిన్నారులకు సంపూర్ణారోగ్యాన్ని అందించేందుకు అనేక రకాల పౌష్టికాహారాలను అందిస్తున్నట్లు వివరించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవి కాలంలో పిల్లలు లోపపోషణకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఎక్కువసార్లు పిల్లలకు తల్లిపాలు పట్టించాలన్నారు. ఆరు నెలల్లోపు పిల్లలకు నీరు, ఇతర ద్రవ పదార్థాలు పట్టవద్దని సూచించారు. ఆరు నెలలు నిండి పోషకాహారం లోపం ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్వాహకులకు సూచించారు. అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు తినిపించాలని తల్లిదండ్రులకు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించరాని, మెనూ ప్రకారం లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చింతలమాధర ఈటీసీ చైర్మన్ తుంరం గోపాల్, సుంగాపూర్ సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, చింతలమాధర, పంగిడి అంగన్‌వాడీ టీచర్లు తుంరం కవిత, కొర్కెట లక్ష్మి, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

శ్రీక్రోధి నామ సంవత్సరం నూతన పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న అర్చక సంఘం నాయకులు

అర్చకుల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలి

- డీడీఎన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణశర్మ
- శ్రీక్రోధి నామ సంవత్సర పంచాగ ఆవిష్కరణ

ఆసిఫాబాట్, మార్చి 31: ధూపదీప నైవేద్యం పథకంలో పనిచేస్తున్న అర్చకుల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణ శర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో శ్రీ క్రోధి నామ సంవత్సర నూతన పంచాంగాన్ని జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు శిరీష్ శర్మ, శ్రీనివాస్ శర్మతో కలిసి అవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, డీడీఎన్ అర్చకులకు పెండింగ్ వేతనాలను విడుదల చేయాలన్నారు. ప్రతినెలా ఐదవ తేదీలోపు వేతనాలను క్రమం తప్పకుండా అందించాలని కోరారు. నూతనంగా అక్టోబర్‌లో నియమించిన అర్చకులకు వేతనాలను చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రతతో పాటు, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్చకుల సమస్యల పరిష్కారం కోసం సంఘం ఆధ్వర్యంలో పలు తీర్మానాలు చేసి రాష్ట్ర సంఘానికి, ఉన్నతాధికారులకు విన్నవించుకొన్నట్లు పేర్కొన్నారు. నూతనంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకమైన సత్యనారాయణశర్మను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సంతోష్ శర్మ, ఉపాధ్యక్షుడు తిరుపతిచారి, గౌరవాధ్యక్షుడు మహేశ్ శర్మ, ఉమ్మడి జిల్లా ప్రచార కార్యదరి ప్రశాంత్, అర్చకులు విజయ్ కుమార్, సూర్యనారాయణ, కులకర్ణి బాపుదేవ్, అభయ్ కుమార్, సతీశ్, శంకరయ్య, సత్యనారాయణ, అర్చకులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటేయాలి : డీఎస్పీ సాదయ్య

జైనూర్‌లో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ సాదయ్య

జైనూర్, మార్చ్ 31 : లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆసిఫాబాద్ డీఎస్పీ సాదయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీఆర్పీఎఫ్ పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం కుమ్రం భీం చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద రాజకీయ నాయకులు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు పెడతామని తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. మసీదు, దేవాలయం, చర్చిల్లో రాజకీయ పార్టీ నాయకులు సమావేశాలు నిర్వహించవద్దని డీఎస్పీ అన్నారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ అంజయ్య, సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బద్రిప్రసాద్, జైనూర్ లింగాపూర్ ఎస్ఐలు సందీప్ కుమార్, ప్రవీణ్ కుమార్, సీఆర్పీఎఫ్ బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

పెరిగిన 'ఉపాధి' కూలి

- రూ.272 నుంచి రూ.300కు పెంపు
- నేటి నుంచి అమలులోకి

ఉపాధి పనుల్లో నిమగ్నమైన కూలీలు

వాంకిడి,మార్చి 31: ఉపాధి హామీ పథకం కూలీ రేటును పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతి ఆర్థిక సంవత్సరం ఆరంభంలో కూలీ రేటును రూరల్ స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రెట్(రూరల్ ఎస్ఎస్ఆర్)ప్రకారం పెంచడం ఆనవాయితీగా వస్తోంది. 2045-25 ఆర్థిక సంవత్సరానికి గాను తెలంగాణలో రోజువారీ కూలిని రూ.272 నుంచి రూ.300కు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.15 పెంచింది. పెంచిన కూలి రేటు ఏప్రిల్ 1 అమల్లోకి రానుంది. మండలంలో సుమారు 11,300 మంది కూలీలు పేర్లు నమోదు చేసుకోగా, రెగ్యులర్‌గా 6,800 మంది వరకు కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఉపాధిహామీ కూలీలకు చెల్లించే కూలిని పెంచడం, హర్షణీయమని మండల ఉపాధి హామీ కూలీలు పేర్కొంటున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సిర్పూర్(టీ), మార్చి 31 : మండల కేం ద్రానికి చెందిన టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దుర్గం భాస్కర్ అన్న దుర్గం చంద్రశేఖర్ ఇటీవల మృతి చెందగా, కుటుంబ సభ్యులను జిల్లా ఇన్‌చార్జి నీతక్క ఆదివారం పరామర్శించారు. ఇక్కడ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి సుగుణ, నాయకులు కోనప్ప, శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేద చిన్నారులకు ఆర్థిక చేయూత

చిన్నారులకు చెక్కును అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మందమర్రి, మార్చి 31 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు రెండోజోన్‌లో ఇటీవల తల్లిదండ్రులు మృతిచెందడంతో అనాథలుగా మారిన చిన్నారులు హార్థిక్, కార్తీక్‌కు ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆర్థిక చేయూతనందించారు. చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయారన్న విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న ట్రస్ట్ సభ్యులు, ఆదివారం చిన్నారుల అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తక్షణంగా రూ.20 వేల సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు బీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. చిన్నారుల తండ్రి శ్యామ్ గతంలో కూలీ పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందాడని, అలాగే తల్లి భూమక్క అనారోగ్యంతో చనిపోవడం చాలా బాధాకరమైన విషయమన్నారు. చిన్నారులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి టీ సురేశ్, ప్రచార కార్యదర్శి శరత్‌బాబు, సభ్యులు ఎస్ మహేందర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఏంఈవో రాధాకృష్ణమూర్తి

నవోదయ, సైనిక్ స్కూల్స్‌కు ఎంపిక

చెన్నూర్, మార్చి 31: చెన్నూర్ పట్టణంలోని శార్వాణి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు జీ దిలీప్, జీ ఆకాశ్ నవోదయ, ఆల్ ఇండియా సైనిక్ పాఠశాల్లో ప్రవేశానికి ఎంపికైనట్టు పాఠశాల కరస్పాండెంట్ మేడ శ్రావణ్‌రెడ్డి తెలిపారు. నవోదయ పాఠశాలకు దిలీప్, ఆల్ ఇండియా సైనిక్ పాఠశాలకు ఆకాశ్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను మండల విద్యాధికారి రాధాకృష్ణమూర్తి, కరస్పాండెంట్ శ్రావణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు స్వామి, మహేశ్ అభినందించారు.

అసాంఘిక కార్యకాలపాలకు దూరంగా ఉండాలి

భీమారం, మార్చి 31 : అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని శ్రీరాంపూర్ సీఐ మోహన్, ఎస్ఐ రాములు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 4 గంటల ప్రాంతంలో ఆవుడం క్రాస్ రోడ్డు సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని పరిశీలించారు. అనంతరం ధర్మారం గ్రామంలో ప్రజలతో మాట్లాడారు. యువత చెడుఅలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనితెలిపారు.

ఘనంగాశిశు మందిర్ వార్షికోత్సవం

వేషధారణలో నృత్యం చేస్తున్న చిన్నారులు

లక్షెట్టిపేట, మార్చి 31 : పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ 46వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పాఠశాల విభాగ్ అధ్యక్షుడు డాక్టర్ విష్ణువర్ధన్‌రావు ముఖ్య అతిథిగా హాజై, జ్యోతి ప్రజ్వలన చేశారు. పట్టుదల క్రమశిక్షణ ఉంటే అనుకున్నది సాధించగలుగుతారని విద్యార్థులకు సూచించారు. అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, జిల్లా కార్యదర్శి నరేందుల రవీంద్ర కుమార్, ఉపాధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు, కార్యదర్శి చింత అశోక్, సహ కార్యదర్శి పల్లెర్ల మనోహర్, అకడమిక్ ఇన్‌చార్జి పూదరి సత్యనారాయణ, పాలకుర్తి లచ్చన్న, ప్రభందకారిణి సభ్యులు ప్రధానాచార్యులు పెంటయ్య, ఆచార్యులు, పూర్వ ఆచార్యులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత పోశకులు పాల్గొన్నారు.

చివరి రోజు చెన్నూర్‌లో పన్నుల వసూళ్లు

చెన్నూర్, మార్చి 31 : 2023-24 ఆర్థిక సంవత్సరంలో చివరి రోజైన ఆదివారం చెన్నూర్ మున్సిపాలిటీలో అధికారులు ఆస్తి పన్నులను వసూలు చేశారు. వంద శాతం లక్ష్యాన్ని చేరుకునేందుకు ఒక్కరోజే మిగిలి ఉండడంతో మున్సిపల్ కమిషనర్ గంగాధర్‌తో పాటు అధికారులు బృందాలుగా పలు వార్డుల్లో తిరుగుతూ పన్నుల వసూళ్ల బాట పట్టారు. పన్నులు చెల్లిస్తే 90 శాతం వడ్డీ మాఫీ అవుతుందని వివరించారు.

ఆస్తి పన్నులను వసూలు చేస్తున్న కమిషనర్ గంగాధర్

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



రాంరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ సభ్యులు

జన్నారం, మార్చి 31 : మండలంలోని ధర్మారం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రాంరెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. కాగా, మండల కేంద్రంలోని జ్యోతి గార్డెన్‌లో ఆదివారం రాంరెడ్డి దంపతులను ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి విజయ్ కుమార్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు కట రాజమౌళి, గోపాల్, శ్రీనివాస సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బార్ అసోసియేషన్ ప్రమాణస్వీకారం

మంచిర్యాల ఏసీసీ, మార్చి 31 : జిల్లా కేంద్రంలోని స్వాగత్‌ప్రైడ్ హోటల్లో సోమవారం మంచిర్యాల బార్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషనర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత బుధవారం ఎన్నికల కమిషనర్ ఎన్ కమలాలమనోహర్ రావు, సహాయ ఎన్నికల కమిషనర్ జీ మహేందర్ పర్యవేక్షణలో అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించిట్లు పేర్కొన్నారు. నూతన అధ్యక్షుడిగా బండవరం జగన్ ఎన్నికవగా, ఉపాధ్యక్షుడిగా కే గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా కే మురళీ కృష్ణ, సంయుక్త కార్యదర్శిగా కనుకయ్య, కోశాధికారిగా అల్లెం శ్రీనివాస్, లైబ్రరీ కార్యదర్శిగా గురువయ్య, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యదర్శిగా సంతోష్ గౌడ్, అసోసియేషన్ మహిళా ప్రతినిధిగా రాధిక, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ప్రదీప్ చంద్ర, శ్రీకాంత్,లక్ష్మీనారాయణ, రమేశ్, ఉమారాణీ ఎన్నికయ్యారు.

ఆడశిశువుతో 108 సిబ్బంది

108 వాహనంలో ప్రసవం

జన్నారం, మార్చి 31 : 108 వాహనంలోనే ఓ మహిళ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సంఘటన జన్నారం మండలంలో చోటుచేసుకున్నది. తెలిసిన వివరాల ప్రకారం.. కవ్వాల్ గ్రామానికి చెందిన శ్యామలకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న 108 పైలెట్లు కిషన్, రఫీక్.. హుటాహుటిని దవాఖానకు తరలిస్తున్నారు. మార్గమధ్యంలోనే శబ్యూమల ప్రసవించింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని పైలట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామల కుటుంబ సభ్యులు పైలెట్లకు కృతజ్ఞతలు తెలిపారు.